Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక
మీ ప్రాంతంలో జరుగుతన్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
Www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
* terms and conditions apply

Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక

ఆదివారం 08-03-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక : 269 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక
మీ ప్రాంతంలో జరుగుతన్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
Www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
* terms and conditions apply

## తెలంగాణలో రికార్డు స్థాయి ఎండలు




### రెండ్రోజులు మరింత తీవ్రత, ఐఎండీ హెచ్చరిక

- ☼ ఉదయం వేళల్లోనే వేడి ఎక్కువ
- ☼ భద్రాచలం, మహబూబ్‌నగర్‌లో 40 డిగ్రీలు
- ☼ రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో ఎండల స్థాయి
- ☼ ఎండ నుంచి రక్షణ కోసం సూచనలు
- ☼ తాగునీరు, పానీయాల ప్రాముఖ్యత
- ☼ అత్యవసర పరిస్థితుల్లో జాగ్రత్తలు

**న్యూస్ డెస్క్, 07 మార్చి (ఇది కద నిజం)**

తెలంగాణలో భానుడు నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. వేసవి ప్రారంభంలోనే తన ప్రతాపం చూపిస్తున్నాడు. ఉదయం 8 దాటిందంటే చాలు కాలు బయటపెట్టాలంటే భయపడాల్సిన పరిస్థితి. ఉదయం 10 తర్వాత రోడ్లు పూర్తి నిర్మానుష్యంగా మారుతున్నాయి. తీవ్ర ఎండలు, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. రాష్ట్రంలో శుక్రవారం (మార్చి 6) పలు జిల్లాల్లో ఎండ తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. భద్రాచలం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అయితే 40 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. భద్రాచలంలో సాధారణంగా 36.3 డిగ్రీలు నమోదు కావాల్సి ఉండగా.. 3.7 డిగ్రీలు పెరిగింది. ఇక మహబూబ్‌నగర్‌లో 36.6 డిగ్రీలకు 3.4 డిగ్రీలు పెరిగింది. ఆదిలాబాద్‌లో 35.5 డిగ్రీల సెల్సియస్‌కు 3.3, ఖమ్మంలో 34.6 డిగ్రీల సెల్సియస్‌కు 4 డిగ్రీలు అధికంగా నమోదైంది.

## సీఎం రేవంత్ రెడ్డితో డెలావర్ గవర్నర్ భేటీ




## అంతర్జాతీయ డ్రగ్స్ నెట్‌వర్క్ ఛేదన
## రూ.10 కోట్ల డ్రగ్స్ స్వాధీనం




న్యూస్ డెస్క్, 07 మార్చి (ఇది కద నిజం): ఇంటర్నేషనల్ డ్రగ్ స్మగ్లింగ్ ముఠాలపై నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ) ఉక్కుపాదం మోపింది. నేపాల్ నుంచి భారత్ మీదుగా శ్రీలంకకు డ్రగ్స్ సరఫరా చేస్తున్న అంతర్జాతీయ బిగ్ నెట్‌వర్క్ గుట్టు రట్టు చేశారు. ఈ ఆపరేషన్‌లో సుమారు రూ.10 కోట్ల విలువైన 77.6 కిలోల హషీష్ ఆయిల్, 2 కిలోల చరాస్ ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఓ శ్రీలంక శరణార్థితో సహా ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు.

ఆపరేషన్ జరిగిందిలా..

ఎన్సీబీ హైదరాబాద్, చెన్నై జోనల్ యూనిట్లు సమన్వయంతో ఈ మల్టీ-స్టేట్ ఆపరేషన్‌ను నిర్వహించాయి.

## పట్టపగలే విజయవాడలో టెర్రర్.. కార్డెన్ సెర్చ్ చేస్తుండగా పోలీసులపైకి కాల్పులకు యత్నం




## కేంద్రం కీలక నిర్ణయం.. న్యూస్ ఛానళ్లకు టీఆర్పీ రేటింగ్‌ల నిలిపివేత




న్యూస్ డెస్క్, 07 మార్చి (ఇది కద నిజం): దేశంలోని వార్తా ఛానళ్లలో పెరుగుతున్న సంచలనాత్మక ధోరణిని అరికట్టేందుకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఒక అనూహ్య నిర్ణయం తీసుకుంది. న్యూస్ ఛానళ్ల టెలివిజన్ రేటింగ్ పాయింట్స్(టీఆర్పీ) నివేదికలను నాలుగు వారాల పాటు లేదా తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు నిలిపివేయాలని బ్రాడ్‌కాస్ట్ ఆడియన్స్ రీసెర్చ్ కౌన్సిల్ ను ఆదేశించింది. ప్రస్తుతం కొనసాగుతున్న ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం నేపథ్యంలో భారతీయ వార్తా ఛానెళ్లు విపరీతమైన కవరేజీని అందిస్తున్నాయి. అయితే, కొన్ని ఛానళ్లు యుద్ధం గురించి ఊహాజనిత మరియు అతిశయోక్తితో కూడిన వార్తలను ప్రసారం చేస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించింది.

## త్వరలో తెలంగాణ సహా 22 రాష్ట్రాల్లో సర్.. నోటిఫికేషన్ విడుదల




## రాజకీయాల్లోకి నటి త్రిష
### హీరో విజయ్ టీవీకే పార్టీలో చేరిక..?

- పాత ఇంటర్వ్యూ వైరల్
- విజయ్-సంగీత విడాకుల చర్చ
- విజయ్-త్రిష వివాహ పుకార్లు
- అధికారిక ప్రకటన లేదు




## వంటింటిపై ఇజ్రాయెల్-ఇరాన్ వార్ ఎఫెక్ట్.. గ్యాస్ ధరలను భారీగా పెంచిన మోడీ సర్కార్

- డొమెస్టిక్ సిలిండర్ రూ.60 పెంపు
- కమర్షియల్ సిలిండర్ రూ.115 పెంపు
- అర్ధరాత్రి కేంద్ర నిర్ణయం
- హైదరాబాద్‌లో రూ.965కి ధర
- ఉజ్వల పథకానికి మార్పు లేదు





## స్కూల్ పిల్లలకు చెప్పుల దండ వేసిన టీచర్స్
## కన్నీటి పర్యంతమైన పేరెంట్స్




న్యూస్ డెస్క్, 07 మార్చి (ఇది కద నిజం): విద్య నేర్పించి పిల్లలను ప్రయోజకులుగా తీర్చిదిద్దాల్సిన గురువులు.. విచక్షణ మరిచారు. క్రమశిక్షణ నేర్పుతామంటూ అమానుషానికి ఒడిగట్టారు. కృష్ణా జిల్లా ఉయ్యూరులోని విజయసాయి స్కూల్‌లో జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. చిన్నారి విద్యార్థులకు చెప్పుల దండ వేసి పాఠశాల ప్రాంగణంలో అవమానించడంపై తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

పాఠశాల విద్యార్థులు కొందరు క్రమశిక్షణ తప్పారని, అల్లరి చేస్తున్నారనే నెపంతో పాఠశాల ఉపాధ్యాయులు అత్యంత దారుణమైన శిక్షను ఎంచుకున్నారు. పిల్లలను మందలించడమో లేదా తల్లిదండ్రులకు చెప్పడమో చేయకుండా.. ఏకంగా విద్యార్థుల మెడలో చెప్పుల దండలు వేసి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. తోటి విద్యార్థుల ముందు అలా ఉంచడంతో ఆ చిన్నారులు తీవ్ర మానసిక వేదనకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకుని యాజమాన్యాన్ని నిలదీశారు. “ఫీజులు కట్టి చదివిస్తున్నది మా పిల్లలను సంస్కారవంతులుగా తీర్చిదిద్దడానికే కానీ, ఇలా అవమానించడానికి కాదు” అంటూ కన్నీటిపర్యంతమయ్యారు. ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలని పాఠశాల ముందు ఆందోళనకు దిగారు.

## ఇరాన్ లొంగిపోవాల్సిందే..
### వేరే ఆప్షన్ లేదు : ట్రంప్ సంచలన ప్రకటన




న్యూస్ డెస్క్, 07 మార్చి (ఇది కద నిజం): ఇరాన్ తో డీల్ పై ట్రంప్ నిర్ణయాలు శరవేగంగా మారుతున్నాయి. తాజాగా ఆయన మరో సంచలన ప్రకటన చేశారు. ఇరాన్ తో ఎలాంటి ఒప్పందం ఉండబోదని, ఆ దేశం బేషరతుగా లొంగిపోవాల్సిందేనని స్పష్టం చేశారు. అలా చేస్తే.. ఇరాన్ ను సంక్షోభం నుంచి బయటకు తీసుకువచ్చేందుకు కృషిచేస్తామన్నారు. ఇరాన్ ను గతంలో ఎన్నడూ లేనిరీతిలో ఆర్థికంగా బలపరుస్తామని, మంచి భవిష్యత్ ఉంటుందంటూ ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ పోస్ట్ చేశారు.

వైట్ హౌస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఇరాన్ ఇప్పటికే చర్చల కోసం వాషింగ్టన్‌ను సంప్రదించడం ప్రారంభించిందని, అయితే ఆ ప్రయత్నాలు చాలా ఆలస్యంగా మొదలయ్యాయని ట్రంప్ అభిప్రాయపడ్డారు. ఇరాన్ క్షిపణి, డ్రోన్ సామర్థ్యాలను అమెరికా దాడులు నిర్వీర్యం చేస్తున్నాయని ఆయన కొనియాడారు. ఈ సైనిక చర్యలు మరో నాలుగు నుండి ఐదు వారాల పాటు కొనసాగవచ్చని, పరిస్థితులను బట్టి ఈ గడువు మారవచ్చని ట్రంప్ సూచించారు. ఇరాన్ తదుపరి సుప్రీం లీడర్ ఎంపికలో తనకు పాత్ర ఉండాలని ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దివంగత అయతొల్లా అలీ ఖమేనీ కుమారుడు మొజ్తబా ఖమేనీని వారసుడిగా తాను అంగీకరించబోనని ఆయన స్పష్టం చేశారు.

## పాకిస్తాన్‌లో ఇంధన బాంబు
### లీటరుపై రూ. 55 పెంచుతూ షాకింగ్ నిర్ణయం



న్యూస్ డెస్క్, 07 మార్చి (ఇది కద నిజం): అమెరికా, ఇజ్రాయెల్- ఇరాన్ యుద్ధం ప్రపంచంలోని ఇతర దేశాల కంటే ఇస్లామిక్ కంట్రీస్ పైనే అధికంగా చూపుతుంది. ముఖ్యంగా పాకిస్తాన్, బంగ్లాదేశ్ వంటి దేశాలు యుద్ధం కారణంగా తీవ్ర ప్రభావాన్ని ఎదుర్కొంటున్నాయి. ఈ క్రమంలో ఎదురవుతున్న ఆర్థిక పరిణామాల నేపథ్యంలో పాకిస్తాన్ ప్రభుత్వం తన దేశ ప్రజలపై భారీ భారాన్ని మోపింది. అర్ధరాత్రి తీసుకున్న ఆకస్మిక నిర్ణయంతో పెట్రోల్, హై-స్పీడ్ డీజిల్ ధరలను లీటరుకు ఏకంగా పికేఆర్ 55 (పాకిస్థానీ రూపాయలు) చొప్పున పెంచింది. పాకిస్తాన్ చరిత్రలో ఇంధన ధరలను ఒకేసారి ఇంత భారీగా పెంచడం ఇదే తొలిసారి. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం వల్ల ఏర్పడిన అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి దేశ ఆర్థిక వ్యవస్థపై చూపిన మొదటి ప్రధాన ప్రభావంగా దీనిని విశ్లేషకులు భావిస్తున్నారు.

కాగా తాజా పరిణామాలపై పాకిస్తాన్ మంత్రి వర్గం చర్చించింది. అనంతరం మార్చి 7న అర్ధరాత్రి జరిగిన విలేకరుల సమావేశంలో పెట్రోలియం శాఖ మంత్రి అలీ పర్వైజ్ మాలిక్, ఉప ప్రధాన మంత్రి ఇషాక్ దార్, ఆర్థిక మంత్రి ముహమ్మద్ ఔరంగజేబ్ ఈ పెంపును అధికారికంగా ప్రకటించారు. ఈ పెంపుతో హై-స్పీడ్ డీజిల్ ధర ప్రస్తుతం ఉన్న రూ. 280.86 నుండి ఏకంగా రూ. 335.86 కు చేరుకుంది. అంటే కేవలం ఒక్కరోజులోనే డీజిల్ ధరపై దాదాపు 20 శాతం భారం పెరిగింది. దేశంలో పెట్రోలియం నిల్వలు సరిపడా ఉన్నాయని, కొరత గురించి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రులు ఈ సందర్భంగా ప్రజలకు హామీ ఇచ్చారు.

అయితే, ఇప్పటికే తీవ్రమైన ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభం తో కొట్టుమిట్టాడుతున్న పాకిస్తాన్ ప్రజలకు ఈ నిర్ణయం గొడ్డలి పెట్టు గా మారింది. రవాణా ఖర్చులు పెరగడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు మరింత ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉంది. ఐఎంఎఫ్ షరతులు, అంతర్జాతీయ మార్కెట్లో పెరుగుతున్న చమురు ధరల ఒత్తిడి కారణంగానే ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినట్లు తెలుస్తోంది.

## కుగ్రామం నుంచి లోక్‌భవన్ వరకు.. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రస్థానం ఇదే!

- గోరఖ్‌పూర్‌లో జననం
- విద్యార్థి ఉద్యమం నుంచి రాజకీయాలు
- యూపీలో ఎమ్మెల్యేగా విజయం
- కేంద్ర మంత్రిగా సేవలు
- హిమాచల్ నుంచి తెలంగాణకు బదిలీ



Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
ఆదివారం 08-03-2026

## సీఎం రేవంత్ రెడ్డితో డెలావర్ గవర్నర్ భేటీ

న్యూస్ డెస్క్, 07 మార్చి (ఇది కద నిజం): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో యూఎస్ఏ డెలావర్ రాష్ట్ర గవర్నర్ మాట్ మేయర్ భేటీ అయ్యారు. హెల్త్, ఎడ్యుకేషన్ రంగంలో సంస్కరణలపై ఈ సమావేశంలో సీఎంతో మాట్ మేయర్ చర్చించారు. డెలావర్ రాష్ట్రంలో అమలు చేసిన పేద మధ్యతరగతి ప్రజలకు ఇండ్లు, రుణమాఫీ ఇతర అంశాలను మ్యాట్ మేయర్ ముఖ్యమంత్రికి వివరించారు. డేటా ప్రివెన్షన్, యూనివర్సల్ హెల్త్ కేర్ పై చర్చించారు. తెలంగాణ ప్రతినిధుల బృందంతో డెలావర్ కు రావాల్సిందిగా సీఎంను మాట్ మేయర్ ఆహ్వానించారు. భవిష్యత్?లో తెలంగాణ, డెలావర్ మధ్య సత్సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు, ఫస్ట్ లేడీ ఆఫ్ డెలావర్ లారెన్ మేయర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పట్టపగలే విజయవాడలో టెర్రర్..

### కార్డెన్ సెర్చ్ చేస్తుండగా పోలీసులపైకి కాల్పులకు యత్నం

న్యూస్ డెస్క్, 07 మార్చి (ఇది కద నిజం): విజయవాడ నగరంలో ఇవాళ ఉదయం పెను ప్రమాదం తప్పింది. పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తుండగా ఓ దుండగుడు ఏకంగా పోలీసులపైకే కాల్పులు జరిపేందుకు ప్రయత్నించడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. అదృష్టవశాత్తూ సాంకేతిక కారణాల వల్ల తుపాకీ పేలకపోవడంతో పోలీసులు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు.

పోలీసుల కథనం మేరకు.. నగరంలోని బాలాజీ హోటల్‌లో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఓ గదిలో ఉన్న వ్యక్తిపై అనుమానం వచ్చి పోలీసులు విచారిస్తుండగా, అతను అకస్మాత్తుగా తన వద్ద ఉన్న తుపాకీ తీసి పోలీసుల వైపు గురిపెట్టాడు. అనంతరం వారిని కాల్చాలనే ఉద్దేశంతో ట్రిగ్గర్ నొక్కాడు. అయితే, దుండగుడు ట్రిగ్గర్ నొక్కినప్పటికీ, గన్‌కు ఉన్న 'ట్రిగ్గర్ లాక్' అవ్వడంతో బుల్లెట్ బయటకు రాలేదు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సదరు దుండగుడిని చకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా నిందితుడి నుంచి 9 ఎంఎం తుపాకీతో పాటు మొత్తం ఐదు బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అసలు ఆ వ్యక్తి ఎవరు..,హోటల్ గదిలో తుపాకీతో ఎందుకు ఉన్నాడు..? పోలీసులపై కాల్పులు జరపాల్సిన అవసరం ఏమొచ్చింది..? అనే కోణంలో పోలీసులు ప్రాథమికంగా నిందితుడిని విచారిస్తున్నారు.

## రాజకీయాల్లోకి నటి త్రిష..

## హీరో విజయ్ టీవీకే పార్టీలో చేరిక..?

న్యూస్ డెస్క్, 07 మార్చి (ఇది కద నిజం): తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ.. కీలక పరిణామం చోటు చేసుకోనున్నట్లు తెలుస్తోంది. తమిళ సినిమా ఇండస్ట్రీలో కీలక నటిగా ఉన్న త్రిష రాజకీయాల్లోకి రాబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో త్రిష సీఎం అవ్వాలని ఉందంటూ మాజీ సీఎం చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. అలాగే ఆమె 2004లో ఇచ్చిన ఒక పాత ఇంటర్వ్యూలో సరదాగా మాట్లాడుతూ.. "భవిష్యత్తులో సీఎం అవ్వాలని ఉందా?" అని అడిగిన ప్రశ్నకు, ఆమె నవ్వుతూ "అవును, మరో పదేళ్లలో అవుతాను, చూస్తూ ఉండండి" అని సమాధానం ఇచ్చారు. 2026 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో విజయ్ టీవీకే (తమిళగ వెట్రి కళగం) పార్టీని స్థాపించడంతో, ఆ పాత ఇంటర్వ్యూ ఇప్పుడు మళ్లీ తెరపైకి వచ్చింది. అయితే, త్రిష తన రాజకీయ ఎంట్రీ పై గానీ, పార్టీలో చేరడం పై గానీ ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు.

విజయ్-సంగీత విడాకుల ఇష్యూ

టీవీకే అధ్యక్షుడు విజయ్ తన భార్య సంగీత తో విడాకులు తీసుకోబోతున్నారనే వార్తలు గత కొంతకాలంగా వినిపిస్తున్నాయి. సంగీత ఇప్పటికే చెంగల్పట్టు ఫ్యామిలీ కోర్టులో విడాకుల పిటిషన్ దాఖలు చేసింది. ఈ కేసులో కోర్టు బయట సెటిల్మెంట్ కోసం విజయ్ దాదాపు 250 కోట్ల భారీ భరణం ఆఫర్ చేసినట్లు ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే.

విజయ్-త్రిష వివాహ పుకార్లు : మార్చి 5, 2026 న చెన్నైలో జరిగిన ఒక ప్రముఖ నిర్మాత కుమారుడి పెళ్లి రిసెప్షన్‌కు విజయ్, త్రిష కలిసి హాజరు కావడం సోషల్ మీడియాలో పెద్ద దుమారం రేపింది. సంగీత విడాకుల పిటిషన్ వేసిన కొద్ది రోజులకే వీరు బహిరంగంగా కలిసి కనిపించడంతో, త్వరలోనే వీరు వివాహం చేసుకోబోతున్నారని గాసిప్స్ బలపడ్డాయి. దీనికి తోడు త్రిష కొత్త సినిమాలకు సైన్ చేయడం లేదని, టీవీకే పార్టీ కార్యక్రమాల్లో విజయ్‌కు అండగా ఉండబోతున్నారని చర్చ నడుస్తోంది. ఈ వార్తలపై త్రిష, విజయ్ స్పందించకపోవడంతో తీవ్ర చర్చ జరుగుతోంది.

## ఇరాన్ అధ్యక్షుడి క్షమాపణలు..లొంగుబాటుపై కీలక ప్రకటన


న్యూస్ డెస్క్, 07 మార్చి (ఇది కద నిజం): ప్రాంతీయ ఉద్రిక్తతలు గరిష్ట స్థాయికి చేరుకున్న తరుణంలో ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఇరాన్ జరిపిన క్షిపణి దాడుల వల్ల ప్రభావితమైన పొరుగు దేశాలకు ఆయన బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. శనివారం ప్రభుత్వ టెలివిజన్ ద్వారా జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ, ప్రాంతీయ శాంతిని కాపాడేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఇరాన్ జరిపిన దాడుల వల్ల ఇబ్బంది పడ్డ పొరుగు దేశాలకు అధ్యక్షుడు పెజెష్కియాన్ క్షమాపణలు తెలియజేశారు. ఇరాన్ భూభాగంపై దాడులు చేయడానికి పొరుగు దేశాల సరిహద్దులను వేదికగా చేసుకుంటే తప్ప, తాము ఏ దేశంపై ముందస్తు దాడులు చేయబోమని ఆయన ప్రకటించారు. ఈ విధానాన్ని ఇరాన్ తాత్కాలిక నాయకత్వ మండలి ఆమోదించినట్లు తెలిపారు.

గత వారం రోజులుగా ఇరాన్.. దుబాయ్, అబుదాబి, ఖతార్, కువైట్ మరియు బహ్రెయిన్‌లోని పలు ప్రాంతాలపై క్షిపణులతో విరుచుకుపడింది. దీనివల్ల పెద్ద ఎత్తున ఆస్తి నష్టం సంభవించింది. ఫిబ్రవరి 28న అమెరికా మరియు ఇజ్రాయెల్ సంయుక్తంగా నిర్వహించిన "ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ" లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. టెహ్రాన్‌లోని ఆయన నివాసంపై జరిగిన ఈ వైమానిక దాడుల్లో ఖమేనీతో పాటు ఆయన కుమార్తె, అల్లుడు, మనవరాలు మరియు భార్య కూడా మరణించారు. ఈ ఘటనకు ప్రతికారంగానే ఇరాన్ గల్ఫ్ దేశాలపై దాడులు ప్రారంభించింది.

శత్రువులకు హెచ్చరిక.. : పొరుగు దేశాలతో తమకు ఎలాంటి శత్రుత్వం లేదని చెబుతూనే, అమెరికా మరియు ఇజ్రాయెల్‌ను ఉద్దేశించి పెజెష్కియాన్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "ఇరాన్ ఎప్పటికీ లొంగిపోదు. ఇరాన్ ప్రజలు లొంగిపోవాలని చూస్తున్న శత్రువుల కోరిక వారి సమాధి వరకు వెళ్లాల్సిందే" అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇరాన్ తీసుకున్న ఈ 'క్షమాపణ' నిర్ణయం పశ్చిమ ఆసియాలో యుద్ధ మేఘాలను కొంతవరకు తొలగిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఇరాన్ లొంగిపోవాల్సిందే.. వేరే ఆప్షన్ లేదు : ట్రంప్ సంచలన ప్రకటన

మొదటి పేజీ తరువాయి



శాంతి కోసం ప్రయత్నిస్తున్నాం: ఇరాన్ అధ్యక్షుడు: మరోవైపు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ స్పందిస్తూ.. అమెరికా – ఇజ్రాయెల్‌తో ఘర్షణను ముగించడానికి కొన్ని దేశాలు మధ్యవర్తిత్వం వహిస్తున్నాయని తెలిపారు. ఇరాన్ ఎల్లప్పుడూ ప్రాంతీయ శాంతికి కట్టుబడి ఉంటుందని, అయితే తమ దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడంలో వెనక్కి తగ్గేది లేదని ఆయన స్పష్టం చేశారు. పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలకు కారణమవుతున్న వారికి ధీటుగా సమాధానం ఇస్తామని ఆయన హెచ్చరించారు.

## అంతర్జాతీయ డ్రగ్స్ నెట్‌వర్క్ ఛేదన

## రూ.10 కోట్ల డ్రగ్స్ స్వాధీనం

మొదటి పేజీ తరువాయి

మార్చి 3న బెంగళూరు–హైదరాబాద్ హైవేపై ఉన్న 'రైకల్ టోల్ ప్లాజా' వద్ద ఒక టాటా సఫారి వాహనాన్ని ఎన్సీబీ అధికారులు తనిఖీ చేశారు. వాహనంలోని రహస్య అరలలో దాచిన 2 కిలోల చరాస్‌ను గుర్తించి ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిని విచారించగా.. అప్పటికే ఒక భారీ కన్సైన్‌మెంట్ తమిళనాడులోని తూత్తుకుడికి చేరినట్లు తెలిసింది. వెంటనే అప్రమత్తమైన చెన్నై ఎన్సీబీ అధికారులు తూత్తుకుడిలో తనిఖీలు చేసి 78 కిలోల హాషిష్ ఆయిల్‌ను పట్టుకున్నారు. ఇక్కడే ఓ శ్రీలంక శరణార్థి సహా మరో ముగ్గురిని అరెస్ట్ చేశారు.

నేపాల్ నుంచి శ్రీలంకకు సముద్ర మార్గంలో..

ఎన్సీబీ విచారణలో దిమ్మతిరిగే విషయాలు వెలుగులోకి వచ్చాయి. నేపాల్‌లోని ఖాట్మండు నుంచి సోనౌలీ సరిహద్దు ద్వారా ఈ డ్రగ్స్‌ను భారత్‌లోకి తీసుకొచ్చారు. వీటిని తూత్తుకుడి తీరం నుంచి చేపల వేట పడవల్లో సముద్ర మార్గం ద్వారా శ్రీలంకకు తరలించాలని స్మగ్లర్లు ప్లాన్ చేశారు. అయితే, ఇండియన్ కోస్ట్ గార్డ్ సహాయంతో సముద్ర సరిహద్దు వద్ద ఈ ప్రయత్నాన్ని అధికారులు అడ్డుకున్నారు. ఈ మొత్తం స్మగ్లింగ్ నెట్‌వర్క్‌ను శ్రీలంకలో ఉన్న ఒక వ్యక్తి ఆపరేట్ చేస్తున్నట్లుగా ఎన్సీబీ గుర్తించింది. అతనే నేపాల్ నుంచి భారత్ మీదుగా శ్రీలంకకు డ్రగ్స్ పంపడానికి కావాల్సిన నిధులను, రవాణా సౌకర్యాలను సమకూర్చుతున్నాడు. ఈ డ్రగ్స్ నెట్‌వర్క్‌ను పూర్తిగా నాశనం చేసేందుకు ఎన్సీబీ మరింత లోతుగా దర్యాప్తు చేపడుతోంది.

## వంటింటిపై ఇజ్రాయెల్-ఇరాన్ వార్ ఎఫెక్ట్..

## గ్యాస్ ధరలను భారీగా పెంచిన మోడీ సర్కార్

న్యూస్ డెస్క్, 07 మార్చి (ఇది కద నిజం): యుద్ధం జరుగుతోన్న నేపథ్యంలో సామాన్యులకు ఊహించని షాక్ తగిలింది. సిలిండర్ ధరలు భారీగా పెరిగిపోయాయి. వంట గ్యాస్, కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధరలను కేంద్ర ప్రభుత్వమే భారీగా పెంచేసింది. ఈ మేరకు అర్ధరాత్రి నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం తాజాగా పెంచిన ధరల ప్రకారం.. 14.2 కిలోల వంట గ్యాస్ సిలిండర్ ధరపై రూ. 60 పెరిగింది. 19 కిలోల కమర్షియల్ సిలిండర్ పై ఏకంగా రూ.115 పెంచింది కేంద్రం. ఈ కొత్త ధరలు నేటి నుంచే అమలులోకి వస్తాయని సంచలన ప్రకటన చేసింది.

ఈ లెక్క ప్రకారం హైదరాబాద్ లో 14.2 కేజీల డొమెస్టిక్ సిలిండర్ ధర రూ.905 నుంచి 965 రూపాయలకు చేరింది. అటు 19 కేజీల కమర్షియల్ సిలిండర్ ధర 1961 రూపాయల నుంచి రూ.2076కు చేరింది. అయితే ఉజ్వల్ పథకం కింద అందించే సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు లేదని సర్కార్ క్లారిటీ ఇచ్చింది. మిడిల్ ఈస్ట్ దేశాలలో యుద్ధ వాతావరణం ఉన్న నేపథ్యంలోనే వంట గ్యాస్ ధరలు పెరిగినట్లు తెలుస్తోంది. వంట గ్యాస్ ను కాస్త అదుపులో వినియోగించుకోవాలని కూడా నిపుణులు సూచిస్తున్నారు.

పెరిగిన ధరలు ఇలా ఉన్నాయి

దేశ రాజధాని ఢిల్లీలో 14.2 కేజీల సిలిండర్ ధర రూ. 853 నుంచి రూ. 913 కు పెరిగింది. అదే సమయంలో కమర్షియల్ 19 కేజీల సిలిండర్ ధర రూ. 1968.50 నుంచి రూ.1883 పెరిగింది. ముంబై మహా నగరంలో రూ.852.50 ఉన్న డొమెస్టిక్ సిలిండర్ ధర రూ. 912.50కి చేరింది. కమర్షియల్ సిలిండర్ ధర రూ. 115 పెరిగి రూ. 1835 కు చేరుకుంది. కోల్ కతా లో రూ. 879 ఉన్న డొమెస్టిక్ సిలిండర్ ధర రూ. 939కి చేరింది. కమర్షియల్ సిలిండర్ ధర రూ. 1990 కి చేరుకుంది. హైదరాబాద్ లో 14.2 కేజీల డొమెస్టిక్ సిలిండర్ ధర రూ.905 నుంచి రూ.965 కు చేరనుంది. కేజీల కమర్షియల్ సిలిండర్ ధర రూ.2076కు చేరనుంది.

## కేంద్రం కీలక నిర్ణయం..

## న్యూస్ ఛానళ్లకు టీఆర్పీ రేటింగ్‌ల నిలిపివేత

మొదటి పేజీ తరువాయి

యుద్ధ ప్రాంతాల్లో కుటుంబ సభ్యులు లేదా స్నేహితులు ఉన్న ప్రజల్లో ఇటువంటి వార్తలు అనవసరమైన ఆందోళనను, భయాన్ని కలిగిస్తాయని మంత్రిత్వ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది.

నాలుగు వారాల పాటు నిషేధం..: రేటింగ్‌ల కోసం పోటీ పడుతూ, బాధ్యతను విస్మరించి సంచలనం కోసం వార్తలను ప్రసారం చేయడం సరికాదని కేంద్రం పేర్కొంది. "ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నాం. కొన్ని ఛానెళ్లు యుద్ధానికి సంబంధించి అనవసరమైన హైప్ ఇస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రసారాలు చేస్తున్నాయి. రేటింగ్‌ల వేటలో పడి వార్తల్లో ఉండాల్సిన ప్రామాణికతను పక్కన పెడుతున్నారు," అని మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో స్పష్టం చేసింది. వార్తా ఛానెళ్లకు వచ్చే ప్రకటనల ఆదాయాన్ని నిర్ణయించడంలో టీఆర్పీ రేటింగ్‌లు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ నిషేధం నాలుగు వారాల పాటు అమల్లో ఉంటుంది. పరిస్థితిని సమీక్షించిన తర్వాత ప్రభుత్వం తదుపరి నిర్ణయం తీసుకోనుంది.

## నిజాం కాలనీ భవన ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం: అండగా నిలిచిన ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్



ఇది కద నిజం ,హైదరాబాద్: నగరంలోని టోలిచౌకి నిజాం కాలనీలో ఇటీవల జరిగిన భవన నిర్మాణ ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ భరోసా కల్పించారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికులు తిరుపతి మరియు ఆదినారాయణ కుటుంబాలకు ఎమ్మెల్యే సహకారంతో ఒక్కొక్కరికి రూ.8 లక్షల చొప్పున, మొత్తం రూ.16 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబాలను పరామర్శించిన ఆయన, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా, ఈ ప్రమాదంలో గాయపడి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇతర కార్మికుల పట్ల కూడా ఎమ్మెల్యే మానవత్వాన్ని చాటుకున్నారు. వారి వైద్య ఖర్చులన్నింటినీ తన సహకారంతో భరించనున్నట్లు ఆయన ప్రకటించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పరంగా కూడా బాధితులకు న్యాయం చేసేందుకు ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు మరియు గాయపడిన కార్మికులకు లేబర్ డిపార్ట్మెంట్ (కార్మిక శాఖ) ద్వారా అందాల్సిన ప్రభుత్వ ఆర్థిక సహాయం త్వరితగతిన అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు.

## త్వరలో తెలంగాణ సహా 22 రాష్ట్రాల్లో సర్.. నోటిఫికేషన్ విడుదల

న్యూస్ డెస్క్, 07 మార్చి (ఇది కద నిజం): తెలంగాణ సహా.. 22 రాష్ట్రాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) సిద్ధమైంది. ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. దేశంలో నకిలీ ఓట్లు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయిన వేళ.. నకిలీ ఓటర్లను తొలగించి, ఓటర్ల లిస్టును ప్రక్షాళన చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఈ సర్ ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే తెలంగాణ సహా 22 రాష్ట్రాల్లో సర్ కు నోటిఫికేషన్ జారీ అయింది. ఏప్రిల్ లో ఈ ఎస్ఐఆర్ ప్రారంభం కానుండగా.. ఇందుకు సంబంధించిన సన్నాహకాలు, శిక్షణా కార్యక్రమాలను చేపట్టింది. తెలంగాణలో రాష్ట్ర ప్రధాన ఎన్నిక అధికారి సి.సుదర్శన్ రెడ్డి ఈ శిక్షణా కార్యక్రమాలను చేపట్టారు. తెలంగాణలో ఈ ప్రక్రియకు సంబంధించి మే 2026 నాటికి క్షేత్రస్థాయి పనులు వేగవంతం కానున్నాయి. 2002 నాటి పాత డేటాను ప్రస్తుత ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేసే పనిని అధికారులు ఇప్పటికే మొదలుపెట్టారు

సాధారణంగా ప్రతి సంవత్సరం నిర్వహించే సమ్మరీ రివిజన్ లో కేవలం మార్పులు, చేర్పులు మాత్రమే చేస్తారు. కానీ సర్ అనేది కాస్త లోతైన ప్రక్రియ. బూత్ లెవల్ ఆఫీసర్లు నేరుగా ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో వెరిఫై చేస్తారు. ఆధునిక సాంకేతికతన ఉపయోగించి ఒకే వ్యక్తికి వేర్వేరు చోట్ల ఉన్న ఓట్లను గుర్తిస్తారు. పట్టణీకరణ వల్ల ప్రాంతాలు మారినవారి ఓట్లను సరిచేసేందుకు సర్ ఉపయోగపడుతుంది. గతేడాది అసెంబ్లీ ఎన్నికలకు ముందే బిహార్ లో సర్ ప్రక్రియను కేంద్రఎన్నికల సంఘం పైలట్ ప్రాజెక్టుగా పూర్తిచేసింది. రెండవ దశలో భాగంగా 12 రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాల్లో సర్ ప్రక్రియను చేపట్టి.. ఫిబ్రవరిలో తుది ఓటర్ల జాబితాను విడుదల చేసింది.

## కుగ్రామం నుంచి లోక్‌భవన్ వరకు.. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రస్థానం ఇదే!

న్యూస్ డెస్క్, 07 మార్చి (ఇది కద నిజం): తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్‌గా అనుభవజ్ఞులైన రాజకీయవేత్త, మాజీ కేంద్ర మంత్రి శివ ప్రతాప్ శుక్లా బాధ్యతలు స్వీకరించబోతున్నారు. హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా పనిచేసిన ఆయనను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలంగాణకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గోరఖ్‌పూర్ యూనివర్సిటీ నుంచి ఎల్‌ఎల్‌బీ..ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని గోరఖ్‌పూర్ జిల్లా రుద్రాపూర్ గ్రామంలో ఏప్రిల్ 1, 1952లో శివ ప్రతాప్ శుక్లా జన్మించారు. గోరఖ్‌పూర్ యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రం పట్టా పొందారు. విద్యార్థి దశలోనే రాజకీయాల పట్ల ఆకర్షితులైన ఆయన 1970లో అఖిల భారత విద్యార్థి పరిషత్ ద్వారా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1975లో అత్యవసర పరిస్థితి సమయంలో మీసా చట్టం కింద దాదాపు 19 నెలల పాటు జైలు శిక్ష అనుభవించారు.

రాజకీయ ప్రస్థానం.. విద్యార్థి సంఘం నాయకుడి ఉన్న శివ ప్రతాప్ శుక్లా అనంతరం బీజేపీలో చేరారు. అక్కడ నిబద్ధత కలిగిన నాయకుడిగా పేరు తెచ్చుకున్న ఆయన ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు.1989 నుంచి 1996 వరకు వరుసగా నాలుగు సార్లు గోరఖ్‌పూర్ అర్బన్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. కళ్యాణ్ సింగ్, రామ్ ప్రకాష్ గుప్త, రాజ్‌నాథ్ సింగ్ మంత్రివర్గాల్లో జైళ్లు, న్యాయశాఖ, గ్రామీణాభివృద్ధి, ప్రాథమిక విద్యాశాఖ మంత్రిగా సేవలందించారు. 2017 నుంచి 2019 వరకు ప్రధాని మోదీ మొదటి ప్రభుత్వంలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు.

గవర్నర్‌గా బాధ్యతలు..ఫిబ్రవరి 2023లో హిమాచల్ ప్రదేశ్ 22వ గవర్నర్‌గా నియమితులైన శివ ప్రతాప్ శుక్లా అక్కడ తనదైన ముద్ర వేశారు. తాజా మార్పుల్లో భాగంగా జిష్ణు దేవ్ వర్మ స్థానంలో ప్రస్తుతం తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టబోతున్నారు. సౌమ్యుడిగా, క్రమశిక్షణ గల నాయకుడిగా గుర్తింపు పొందిన శివ ప్రతాప్ శుక్లా రాకతో తెలంగాణ రాజ్‌భవన్‌లో నూతన అధ్యాయం మొదలైందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## తెలంగాణలో రికార్డు స్థాయి ఎండలు

## రెండ్రోజులు మరింత తీవ్రత, ఐఎండీ హెచ్చరిక


మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో సాధారణం కన్నా రెండుమూడు డిగ్రీలు అధికంగా ఎండలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా నల్గొండ, సూర్యాపేట, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ములుగు జిల్లాల్లో భానుడి ప్రతాపం ఎక్కువగా ఉంటుందని ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. మిగిలిన 27 జిల్లాలకు అధికారులు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్, జగిత్యాల, మహబూబాబాద్, జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో 39.5 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే ఛాన్స్ ఉందని చెప్పారు.

తీవ్ర ఎండల నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండటానికి తరచుగా నీరు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి పానీయాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి 4 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది కాబట్టి.. ఆ సమయంలో అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా చూసుకోవాలంటున్నారు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే.. వదులైన కాటన్ దుస్తులు ధరించాలని సూచిస్తున్నారు. గొడుగు, టోపీని ఉపయోగించాలని.. అలాగే కళ్లకు సన్ గ్లాసెస్ పెట్టుకోవడం మంచిదని చెబుతున్నారు. నూనెలో వేయించిన పదార్థాలు, మసాలాలు తగ్గించి తేలికపాటి ఆహారం తీసుకోవాలని అంటున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ఎండల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

## మావోయిస్టు పార్టీ చరిత్రలో కీలక పరిణామం..

## ఇక తెలంగాణ స్టేట్ కమిటీ ఇక లేదు



న్యూస్ డెస్క్, 07 మార్చి (ఇది కద నిజం): తెలంగాణ మావోయిస్టు పార్టీ చరిత్రలో కీలక పరిమామం చోటు చేసుకుంది. మావోయిస్టు పార్టీ స్టేట్ కమిటీ ఇక లేదని ఈ కమిటీకి సంబంధిచి మిగిలిన వారందరూ సరెండర్ అయ్యారని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో 130 మంది మావోయిస్టులు 124 ఆయుధాలు అప్పగించి లొంగిపోయారు. వీరిలో తెలంగాణ స్టేట్ కమిటీ నుంచి ఐదుగురు లొంగిపోవడంతో ఇక రాష్ట్ర కమిటీ చరిత్రలో మిగిలిపోనుంది. దేశవ్యాప్తంగా తుపాకీ ద్వారానే మార్పు వస్తుందని తెలంగాణ నాయకుల నేతృత్వంలో పోరాటం కొనసాగించిన మావోయిస్టు పార్టీకి ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర కమిటీ లేకుండా పోయింది. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో తెలంగాణకు సంబంధించిన వారు ఇతర కమిటీలన్నింటిలో కేవలం ఏడుగురు మాత్రమే ఉన్నారని వారు కూడా త్వరగా సరెండర్ కావాలని పిలుపునిచ్చారు.

ఆయుధాలు కలిగి ఉంటే సహించేది లేదు: లొంగిపోయిన వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక రీజినల్ కమిటీ సభ్యుడు, పది మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 46 మంది ఏరియా కమిటీ సభ్యులు, 70 మంది పార్టీ సభ్యులు ఉన్నారు. లొంగిపోయిన వారు ఒక ఇన్ సాస్ ఎల్ఎంజీ రైఫిల్, 31 ఏకే-47 రైఫిళ్లు, 21)ఇన్?సాస్ రైఫిళ్లు, 20 ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, (18) 303 రైఫిళ్లు, 33 ఇతర తుపాకులను ప్రభుత్వానికి అప్పగించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మావోయిస్టుల హోదాలను బట్టి ప్యాకేజీ కల్పిస్తామని ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలో భూమి లభ్యత కష్టంగా ఉన్నందునా భూమి ఇవ్వడంపై హామీ ఇవ్వలేనన్నారు. రాష్ట్రంలో హింసకు తావులేదని అక్రమంగా ఆయుధాలు కలిగి ఉంటే సహించేది లేదన్నారు.

# హైదరాబాద్‌లో ఏసీబీకి చిక్కిన జీహెచ్‌ఎంసీ అధికారి

### రూ.35,000 లంచం తీసుకుంటూ అరెస్ట్



ఇది కద నిజం : సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు మెరుపు దాడి నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ అకౌంట్స్ సెక్షన్‌లో ఎగ్జామినర్‌గా విధులు నిర్వహిస్తున్న ఒక అధికారి, బాధితుడి నుంచి రూ.35,000 లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం, పదవీ విరమణ పొందిన ఒక ఉద్యోగికి రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఫైల్‌ను క్లియర్ చేసి, దానిని జీహెచ్‌ఎంసీ హెడ్ ఆఫీస్‌కు పంపేందుకు సదరు ఎగ్జామినర్ లంచం డిమాండ్ చేశారు. మొదట రూ.40,000 అడిగినప్పటికీ, చివరకు రూ.35,000 ఇచ్చేలా ఒప్పందం కుదిరింది. తన పని కోసం అధికారి లంచం అడగడంతో విసిగిపోయిన బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వ్యూహరచన చేసిన ఏసీబీ బృందం, సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో నిందితుడు లంచం తీసుకుంటుండగా ఒక్కసారిగా దాడి చేసి పట్టుకుంది. నిందితుడి వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్న అధికారులు, అతనిపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఈ వ్యవహారంలో ఇంకా ఎవరి పాత్ర అయినా ఉందా అనే కోణంలో అధికారులు లోతైన విచారణ జరుపుతున్నారు.

# వేసవి రోజుల్లో ఎద్దాడిని నివారించాలి



ఇది కద నిజం ,సికింద్రాబాద్ : రానున్న వేసవి రోజుల్లో కూడా సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో నీటి ఎద్దడి ఎదురుకాకుండా అన్నీ చర్యలు తీసుకోవాలని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన సికింద్రాబాద్ ఎం.ఎల్.ఏ క్యాంపు కార్యాలయంలో జల మండలి జనరల్ మేనేజర్ వినోద్ కుమార్, ఇతర అధికారులతో సమావేశమై, వేసవి కార్యాచరణ ప్రణాళికా పై సూచనలు చేశారు. రోజు జరిగే నీటి సరఫరా అన్నీ రిజర్వేయర్లకు సాఫీ గా సాగేలా జాగ్రత్త పడాలని, అన్నీ మున్సిపల్ డివిజన్ల పరిధుల్లో నీటి ఎద్దడి ఎదురు కాకుండా ఏర్పాట్లు చేసుకోవాలని పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా కోరారు. పవర్ బోర్ ల మరమ్మతులు పూర్తి చేయాలిని, కనెక్షన్ ల ప్రక్రియను పూర్తి చేసి అన్నీ పవర్ బోర్ లు వాడకంలోకి తేవాలని ఆదేశించారు. ట్యాంకర్ లను అందు బాటులో ఉంచాలని, ఓయూ క్యాంపస్ లో సరఫరా సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు. సివారేజీ సమస్యలు అధికంగా ఉన్నాయని, పూడిక తీసిన వెంటనే తొలగించడం లేదని తెలిపారు. కొత్తగా మున్సిపల్ డివిజన్ల విభజన కు అనుగుణంగా సిబ్బందికి ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఆయా అంశాల పై సానుకూలంగా ఉన్నట్లు జీ. ఏం. వినోద్ కుమార్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన చేవెళ్ల కాంగ్రెస్ శ్రేణులు



ఇది కద నిజం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మరియు ఇటీవల రాజ్యసభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎంపికైన వేం నరేందర్ రెడ్డిని చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. రాజ్యసభ అభ్యర్థిగా ఎంపికైనందుకు నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణుల తరపున వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న నవాబ్‌పేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటయ్య మాట్లాడుతూ వేం నరేందర్ రెడ్డి కి రాజ్యసభ అవకాశం దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నిబద్ధత కలిగిన నాయకుడిగా పార్టీ కోసం ఆయన చేస్తున్న కృషికి తగిన గుర్తింపు లభించిందని కొనియాడారు. వారి పదవీ కాలంలో చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి పూర్తి సహకారం అందుతుందని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు అందరం ఐక్యంగా కృషి చేస్తామని వెంకటయ్య స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మండల అధ్యక్షులు మానయ్య, బీసీ సెల్ అధ్యక్షులు శ్రీధర్, పులుమామిడి గ్రామ సర్పంచ్ నర్సింలు మరియు నియోజకవర్గంలోని ఇతర ముఖ్య నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కుక్కునూరు టీడీపీ అధ్యక్ష పీఠంపై 'నాగన్న'

- వరుసగా రెండోసారి ఎంపికైన కాపు నేత
- గ్రామ కమిటీ అధ్యక్షులతో కలిసి ప్రమాణం
- పార్టీని మరింత బలోపేతం చేస్తా: నాగు





ఇది కద నిజం, కుక్కునూరు: చాలా రోజుల పాటు ఉత్కంఠను రేపిన కుక్కునూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవికి కొద్ది రోజుల క్రితమే ఎండ్ కార్డ్ పడింది. అందరూ అనుకున్నట్లుగానే ప్రస్తుత అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు (నాగు)నే మళ్లీ ఆ పదవిలో కొనసాగుతారని కొద్ది రోజుల క్రితమే ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు బడేటి రాధాకృష్ణయ్య ప్రకటించారు. ఈ క్రమంలోనే శనివారం పోలవరం నియోజకవర్గంలోని బుట్టాయిగూడెంలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, పోలవరం నియోజకవర్గ అబ్జర్వర్ అనపర్తి నారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కుక్కునూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా ములిశెట్టి నాగు, పార్టీ మండల సెక్రటరీ (కార్యదర్శి)గా చుంచు సత్యనారాయణతో పాటు మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు గానూ 15 మంది గ్రామ కమిటీ అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీని అంటిపెట్టుకొని ఉండటమే కాకుండా, టీడీపీ అభివృద్ధి కోసం నాయకులు, కార్యకర్తలకు వెన్నెముకలా ఉండి, మండల ప్రజల విశ్వాసాన్ని పొందిన ఏకైక యూత్ నాయకుడు నాగు అని కొనియాడారు. అనంతరం పార్టీ నియోజకవర్గ అబ్జర్వర్ అనపర్తి నారాయణ మాట్లాడుతూ.. చిన్న వయసులోనే ఇంత ప్రజాదరణ పొందిన నాయకుడిని తాను ఇంత వరకు చూడలేదని అన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీలో కష్టపడే వారిని గుర్తిస్తారని, అదే బాటలోనే నడిచిన నాగును రెండోసారి అధ్యక్షుడిగా చేశారని ఆయన తెలిపారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బొల్లు కృష్ణార్జునరావు, కుక్కునూరు ఉపసర్పంచ్ పిచ్చుక రాజు, సీనియర్ నాయకులు కోటగిరి సత్యనారాయణ, సరిహద్దు సత్యనారాయణ, వెంకటరమణ, రమణ రాజు, పులి శ్రీనివాసరావు, రాంబాబు, సూర్యం, రమణయ్య, యూత్ నాయకులు ఉదయ్, పిచ్చుక హరిబాబు, నరేంద్ర రాజు, పాదం రాము తదితరులు పాల్గొన్నారు.

### పార్టీని మరింత బలోపేతం చేస్తాను: ములిశెట్టి నాగు

రెండోసారి కుక్కునూరు మండల టీడీపీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ములిశెట్టి నాగు మాట్లాడారు. గతంలో కంటే మరింత ఉత్సాహంతో పని చేస్తూ, పార్టీ మరింతగా బలోపేతం చేస్తానని అన్నారు. అలాగే, తనపై నమ్మకం ఉంచి మరోసారి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు బడేటి రాధాకృష్ణ, ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్, పోలవరం ఇన్‌చార్జ్ బొరగం శ్రీను, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు నాగు వెల్లడించారు. పార్టీ అభివృద్ధి కోసం అందరినీ కలుపుకుని ముందుకు వెళ్తానని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ కష్టకాలంలో తనకు అండగా నిలిచిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు ధన్యవాదాలు తెలుపుతున్నానని ఆయన చెప్పుకొచ్చారు

# గడపగడపకు సీపీఐ కార్యక్రమానికి విశేష స్పందన



ఇది కద నిజం, కుక్కునూరు: సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల నాయకుల ఆధ్యర్యంలో చేపట్టిన 'గడపగడపకు సీపీఐ' కార్యక్రమానికి కుక్కునూరు మండలంలో విశేషమైన స్పందన లభిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెదరాయిగూడెం, కివ్వాక గ్రామాల్లో నాయకులు ఇంటింటికి తిరిగి విరాళాలను సేకరించారు. దివ్యాంగులు సైతం విరాళాలు ఇవ్వడానికి ముందుకు వస్తున్నారు. దీనిపై సంతృప్తిని వ్యక్తం చేసిన కుక్కునూరు మండల సీపీఐ కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య మాట్లాడుతూ.. కుక్కునూరు మండలం వ్యాప్తంగా గడపగడపకు సీపీఐ కార్యక్రమం జోరుగా సాగుతుందని తెలిపారు. అలాగే, కార్మిక, కర్షకుల హక్కుల సాధన కోసం పోరాడి సాధించుకున్న ఘనత ఒక్క సీపీఐకి మాత్రమే దక్కుతుందని ఆయన అన్నారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా లక్ష్మయ్య కోరారు. అదే సమయంలో గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల, మైసాక్షి వెంకటాచారి, కురాకుల బాబూరావు, పల్లెల భిక్షం, సోడే నాగేష్, సోడే ఇరమయ్య, మల్లయ్య, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

# జిమ్ఖానా గ్రౌండ్‌లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



ఇది కద నిజం ,సికింద్రాబాద్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్‌లోని జిమ్ఖానా గ్రౌండ్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా (ఖ్యూా) నందకిశోర్ గోకుల్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు. క్రీడారంగంలో మహిళలు రాణించేలా ప్రభుత్వం అన్ని రకాల ప్రోత్సాహకాలు అందిస్తోందని, ముఖ్యంగా క్రీడాకారిణులు తమ నైపుణ్యాలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జిల్లాకు, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. మహిళా సాధికారత కేవలం మాటలకే పరిమితం కాకుండా, క్రీడా మైదానాల్లో వారి ప్రతిభ ద్వారా నిరూపితమవుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడా రంగానికి చెందిన ప్రముఖ బాక్సింగ్ కోచ్ పి. మనోజ్ రెడ్డి, ఖేలో ఇండియా కబడ్డీ కోచ్ నిరీషన్ రెడ్డి, పవర్ లిఫ్టింగ్ కోచ్ హేమలత, ఫుట్‌బాల్ కోచ్ మహేష్ మరియు స్కేటింగ్ కోచ్ అనూప్ యమ తదితరులు పాల్గొన్నారు. వీరంతా మహిళా క్రీడాకారిణులను ఉత్సాహపరుస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీడాకారులు, విద్యార్థులు మరియు క్రీడా అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వేడుకను విజయవంతం చేశారు.

# నిధుల వినియోగం, గ్రామ అభివృద్ధే నా లక్ష్యం: సర్పంచ్ తలారి వెంకటమ్మ



ఇది కద నిజం ,నవాబుపేట్: వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండలం మీనపల్లి కలాన్ గ్రామంలో గ్రామ సర్పంచ్ తలారి వెంకటమ్మ అధ్యక్షతన గ్రామ సాధారణ సమావేశం అత్యంత ఉత్సాహంగా జరిగింది. ఈ సమావేశంలో వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని గ్రామాభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తలారి వెంకటమ్మ మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుండి అందుతున్న ప్రతి పైసాను పారదర్శకంగా గ్రామ అవసరాల కోసమే ఖర్చు చేస్తానని స్పష్టం చేశారు. గ్రామంలో ప్రస్తుతం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల గురించి చర్చిస్తూ, ముఖ్యంగా నీటి ఎద్దడిని నివారించడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని తెలిపారు. ఇప్పుడు మంజూరైన నిధులతో ముందుగా మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని ఆమె గ్రామస్తులకు హామీ ఇచ్చారు. తన పదవీ కాలంలో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన ఏకైక లక్ష్యమని ఆమె పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు వార్డు మెంబర్ శేఖర్, పంచాయతీ కార్యదర్శి విశ్వనాథం, ఉప సర్పంచ్ అంజి యాదవ్ పాల్గొని తమ సూచనలు చేశారు. వీరితో పాటు వార్డు సభ్యులు, గ్రామ ప్రముఖులు శిలాపురం లక్ష్మి, పట్నం విజయ్ కుమార్, చేవెళ్ల కమలమ్మ, చేవెళ్ల ప్రభాకర్, సర్పంచ్ తనయుడు రమేష్, శిలాపురం పందు తదితరులు పాల్గొని ఈ సమావేశాన్ని విజయవంతం చేశారు.

# కార్వాన్‌లో చెత్త సమస్యకు చెక్ 20 కొత్త సైకిల్ రిక్షాల ప్రారంభం



ఇది కద నిజం : కార్వాన్ డివిజన్‌లో చెత్త సేకరణను వేగవంతం చేసేందుకు గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ 20 కొత్త సైకిల్ రిక్షాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. Mim పార్టీ ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహినుద్దీన్ సహకారంతో ఈ రిక్షాలు మంజూరయ్యాయి. కార్వాన్ వార్డ్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ రిక్షాలను ప్రారంభించారు. కార్యక్రమంలో AIMIM మాజీ కార్పొరేటర్లు, GHMC శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ రిక్షాల ద్వారా కాలనీలు, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లలో చెత్త సేకరణ మరింత సమర్థంగా జరుగుతుందని అధికారులు తెలిపారు

# సినిమా న్యూస్

## 2025 తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డులు ప్రకటన



ప్రజా యుద్ధ నౌక గద్దర్ పేరుతో తెలంగాణ ప్రభుత్వం గద్దర్ ఫిల్మ్ అవార్డులను అందజేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా 2025 ఏడాదికి గాను అవార్డులను జ్యూరీ ప్రకటించింది.ఉత్తమ చిత్రంగా రాజ్ వెడ్స్ రాంబాయి, ఉత్తమ నటిగా తెలంగాణ కొత్త కోడలు రష్మిక ఎంపికయ్యారు. మెగాస్టార్ చిరంజీవికి ఎన్టీఆర్ అవార్డు వరించింది. ఏఎన్ఆర్ అవార్డు జయసుధకు దక్కింది. కాంతారావు అవార్డు ఆర్ నారాయణ మూర్తి, బీఎన్ రెడ్డి అవార్డు సింగితం శ్రీనివాసరావు, పైడి జయరాజ్ అవార్డు కమల్ హాసన్ కు వరించగా సినారె అవార్డు సుద్దాల అశోక్ తేజ, రఘుపతి వెంకయ్య అవార్డుకు రమేశ్ ప్రసాద్ ను ఎంపిక చేశారు.

**భట్టితో జ్యూరీ భేటీ:**

అంతకు ముందు జ్యూరీ 2025వ సంవత్సరానికి గానూ తుది జాబితాను జ్యూరీ సభ్యులు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు అందజేశారు. ప్రజా భవన్?లో తెలంగాణ ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, నటుడు తనికెళ్ల భరణి, రోజా రమణి, మణిశర్మ, ప్రగతి తదితరులు భట్టితో భేటీ అయ్యారు. అవార్డుల ఎంపిక ప్రక్రియ, వేడుక నిర్వహణపై వారు చర్చించారు. అనంతరం జ్యూరీ చైర్మన్ మణిశర్మ ఆధ్వర్యంలో విజేతల జాబితాను అధికారికంగా వెల్లడించారు.

ఉత్తమ చిత్రం -రాజు వెడ్స్ రాంబాయి
ఉత్తమ నటుడు-నాగ చైతన్య(తండేల్)
ఉత్తమ నటి -రష్మిక మందన్న (ది గర్ల్ ఫ్రెండ్)
ఉత్తమ ద్వితీయ చిత్రం- దండోరా
ఉత్తమ తృతీయ చిత్రం -ది ఫ్రీ వెడ్డింగ్ షో
నేషనల్ ఇంటిగ్రిటీ సినిమా-తండేల్
స్పెషల్ జ్యూరీ అవార్డులు:
ఎన్టీఆర్ నేషనల్ అవార్డు -చిరంజీవి
పైడి జైరాజ్ అవార్డు- కమల్ హాసన్
సినారే అవార్డు-సుద్దాల అశోక్ తేజ
రఘుపతి వెంకయ్య అవార్డు -రమేశ్ ప్రసాద్
అక్కినేని నాగేశ్వరరావు అవార్డు -జయసుధ
నాగిరెడ్డి చక్రపాణి అవార్డు-అశ్వనీదత్
బీఎన్ రెడ్డి ఫిల్మ్ అవార్డు-సింగీతం శ్రీనివాసరావు
కాంతారావు అవార్డు-ఆర్.నారాయణమూర్తి
ఉత్తమ సోషల్ మెసేజ్ సినిమా - కోర్ట్
ఉత్తమ డాక్యుమెంటరీ - యూనిటీ
ఉత్తమ ప్రజాదరణ చిత్రం - సంక్రాంతికి వస్తున్నాం
బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ పరిచయ దర్శకుడు - సాయి మార్తాండ్ (లిటిల్ హార్ట్స్)
ఉత్తమ బాలల చిత్రం - అనగనగా
ఉత్తమ సహాయ నటుడు - శివాజీ

## బిగ్ అనౌన్స్‌మెంట్ లోడింగ్

### వైరల్ అవుతున్న త్రిష ఇన్‌స్టా పోస్ట్.. పెళ్లి గురించేనా?



కోలీవుడ్ స్టార్ హీరో విజయ్- నటి త్రిష మధ్య నడుస్తున్న రిలేషన్‌షిప్ వార్తలు ఇప్పుడు సోషల్ మీడియాలో ఒక రేంజ్‌లో వైరల్ అవుతున్నాయి. గతంలో వీరిద్దరూ కలిసి వెండితెరపై ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించారు. అయితే ఇప్పుడు నిజజీవితంలో కూడా వీరు జంటగా మారబోతున్నారనే వార్తలు కోలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకు ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఇటీవల విజయ్-త్రిష కలిసి ఒక వివాహ వేడుకలో జంటగా పాల్గొనడం ఈ పుకార్లకు మరింత బలం చేకూర్చింది. ముఖ్యంగా వీరిద్దరూ భార్యాభార్యల్లా పక్కపక్కనే నిలబడి ఫోటోలకు ఫోజులివ్వడం చూసి అభిమానులు షాక్ అవుతున్నారు. విజయ్ తన భార్య సంగీతకు విడాకులు ఇచ్చి త్రిషను పెళ్లి చేసుకోబోతున్నారనే ప్రచారం జోరుగా సాగుతున్న సమయంలోనే ఈ ఫోటోలు బయటకు రావడం చర్చకు దారితీసింది.

ఈ రచ్చ ఇలా ఉండగానే, త్రిష చేసినట్లుగా ఒక ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. అందులో.. "ముందు ఎన్నికలు జరగనివ్వండి.. అందరి ఆశీస్సులతో త్వరలోనే ఒక బిగ్ అనౌన్స్‌మెంట్ చేయబోతున్నాం" అని రాసి ఉండటం విశేషం. ఇది చూసిన వారంతా విజయ్-త్రిష పెళ్లి గురించే ఆమె హింట్ ఇచ్చిందని అనుకుంటున్నారు. అయితే, త్రిష అఫీషియల్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ప్రస్తుతం ఈ పోస్ట్ ఎక్కడా కనిపించడం లేదు. ఆమె పేరు- ప్రొఫైల్ ఫోటోతో ఎవరో కావాలనే దీనిని సృష్టించి వైరల్ చేస్తున్నారా? లేక త్రిష డిలీట్ చేసిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఫ్రాంకీ బాయ్ పేజీ ద్వారా ఈ పోస్ట్ ట్రెండ్ అవుతోంది. కాగా.. విజయ్ ఇప్పటికే తన రాజకీయ పార్టీ తమిళగ వెట్రి కళగం (టీవీకే) ను స్థాపించి ఎన్నికల బరిలోకి దిగబోతున్న విషయం తెలిసిందే. రాజకీయాల్లో ఇమేజ్ చాలా ముఖ్యం కాబట్టి, ఎన్నికల సమయంలో వివాదాలు వద్దని విజయ్ భావిస్తున్నారట. అందుకే ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే త్రిషతో తన బంధాన్ని అధికారికంగా ప్రకటించి, పెళ్లి పీటలెక్కబోతున్నారని ప్రచారం జరుగుతోంది.




## 'డ్రాగన్'లో పవర్‌ఫుల్ పాత్రలో ఖుష్బూ?




'మ్యాన్ ఆఫ్ మాసెస్' జూనియర్ ఎన్టీఆర్ - సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'డ్రాగన్'. గత ఏడాది కాలంగా ఈ సినిమా కోసం తారక్ అభిమానులతో పాటు, సినిమా ప్రియులు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. ఈ మూవీ నుంచి వచ్చే అప్‌డేట్స్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. ఇటీవలే చిత్ర యూనిట్ జోర్డాన్‌లో ఒక భారీ యాక్షన్ షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. అక్కడ ఎన్టీఆర్ ఎటువంటి డూప్ లేకుండా రిస్కీ స్టంట్స్ చేశారని సమాచారం. షెడ్యూల్ కంటే ముందుగానే చిత్ర బృందం షూటింగ్ పూర్తి చేసుకుని హైదరాబాద్‌కు చేరుకున్న విషయం తెలిసిందే.

ఈ సినిమాలో నటించే నటీనటుల గురించి ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో తెగ వార్తలు వైరల్ అవుతున్నాయి. ఇందులో బాలీవుడ్ సీనియర్ స్టార్ అనిల్ కపూర్ కీలక పాత్రలో నటిస్తున్నారు. 'వార్ 2' తర్వాత ఎన్టీఆర్‌తో ఆయన నటిస్తున్న రెండో సినిమా. ఈ విషయాన్ని అనిల్ కపూర్ స్వయంగా సోషల్ మీడియా వేదికగా ధృవీకరించారు. మలయాళ స్టార్ టొవినో థామస్ ఇందులో విలన్‌గా నటిస్తున్నారనే వార్తలు కూడా వస్తున్నాయి. ఇదే సమయంలో తాజాగా మరొకరు కూడా ఈ సినిమాలో కీ రోల్ ప్లే చేయబోతున్నారని సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. ప్రముఖ నటి ఖుష్బూ సుందర్ ఈ ప్రాజెక్ట్‌లో భాగం అయ్యారని సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. ఇదే నిజం అయితే ఖుష్బూ డ్రీమ్ తీరినట్టు అవుతుంది. పలు సందర్భాల్లో ఆమె మాట్లాడుతూ.. ఎప్పటి నుంచో తనకు తారక్‌తో నటించాలనే కోరిక ఉందని బయటపెట్టారు. దీనికి సంబంధించి ఇప్పటి వరకు చిత్ర బృందం ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

## 'డేవిడ్ రెడ్డి'తో ఎంట్రీ ఇస్తున్న ఉక్రెయిన్ భామ



'డేవిడ్ రెడ్డి' అనే పాన్-ఇండియా చిత్రంతో రాకింగ్ స్టార్ మంచు మనోజ్ హీరోగా ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో హీరోయిన్‌గా ఉక్రెయిన్ నటి మరియా ర్యాబోషప్కా నటిస్తున్నారు. 'ప్రిన్స్' చిత్రంతో తమిళంలో పరిచయమైన ఈ భామ.. ఇప్పుడు టాలీవుడ్‌లో అడుగుపెట్టబోతోంది. ఇటీవల విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో మనోజ్ ఫిరోషియస్ వారియర్ లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది. బ్రిటిష్ కాలం నేపథ్యంలో..1897 నుంచి 1922 వరకు బ్రిటిష్ కాలనీ యుగంలో జరిగే కథ ఆధారంగా ఈ చిత్రం రూపుదిద్దుకుంటుందని సమాచారం. అణచివేతకు వ్యతిరేకంగా ఒక మనిషి ఎదిగిన తీరును చూపించే హిస్టారికల్ యాక్షన్ డ్రామా అని, ఇందులో మనోజ్ పాత్ర 'డేవిడ్ రెడ్డి' అని అంటున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్ మరియా క్లారా విట్‌మోర్ పాత్రలో నటిస్తున్నారు. 'ఆమె ప్రేమే యుద్ధం' అనే ట్యాగ్‌లైన్‌తో ఈ చిత్రం నుంచి ఆమె పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ చిత్రానికి హనుమా రెడ్డి యక్కంటి దర్శకుడు. ఈ మూవీని నల్లగంగుల వెంకట్ రెడ్డి, భరత్ మోతుకూరి వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. గతంలో ఈ చిత్రం నుంచి రిలీజ్ అయిన మనోజ్ పోస్టర్ అభిమానులను ఫిదా చేసింది. అలాగే డిసెంబర్‌లో రిలీజ్ అయిన గ్లింప్స్ కూడా సినిమాపై హైప్ క్రియేట్ చేసింది. ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. దీనికి కేజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.




## 'ధురంధర్ 2' ట్రైలర్ విడుదల!

రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా, ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్: ది రివెంజ్' నుంచి ట్రైలర్ వచ్చేసింది. మార్చి 19న సినిమా గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతున్న తరుణంలో మేకర్స్ నేడు ట్రైలర్‌ను విడుదల చేశారు. గత ఏడాది భారీ విజయాన్ని అందుకున్న 'ధురంధర్'కు ఇది సీక్వెల్. ఈ సినిమాలో రణ్‌వీర్ సింగ్.. జస్కిరత్ సింగ్, హమ్జా అనే రెండు పవర్‌ఫుల్ పాత్రల్లో కనిపించబోతున్నారు. సుమారు 3 గంటల 40 నిమిషాల నిడివి కలిగిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను సృష్టించేందుకు సిద్ధంగా ఉంది. రణ్‌వీర్ సింగ్‌తో పాటు సంజయ్ దత్, ఆర్. మాధవన్, అర్జున్ రాంపాల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.